# అస్పృశ్యత

ఉభయ భాషా ప్రవీణ భువనగిరి లక్ష్మీకాంతమ్మగారు

ఒకమాలెత, భుజంమీద బిందెతో ఒక బ్రాహ్మణి.

బ్రాహ్మణి—ఎవరే? ఎవరే నువ్వూ అంత రాసుకొస్తున్నావూ?

మాలెత—ఏ మమ్మోయి! - నోరు మూసుకో. లేకుంటే వూసులు బాగా రానియ్యి. ఏ మనుకొన్నావ్?

బ్రాహ్మణి—నే నే మన్నానే నిన్నూ? ఎవరను వ్వన్నాను. తప్పా? బ్రాహ్మలం వస్తూవుంటే కొస్తంత తప్పకోవద్దూ? ఇంత దొళ్లదోవా?

మాలెత—ఎల్ల వమ్మా ఊ' గుంజాకోకా. ఏమే. యేమే యేంటీ? ఎవళ్లనుకున్నావ్?

బ్రాహ్మణి—ఏమే అంటేనే తప్పొచ్చిందా? మాలెత ఏమండీ, అనిపించుకోవడం మీకు మంచిది కాదు సుమీ.

మాలెత—ఏంటీ? మాకూ మీకూ తేడా యేంటమ్మా?

బ్రాహ్మణి—మీకూ మాకూ తేడా. లేనే లేదంటావూ?

మాలెత—ఏం వుం దేంటి?

బ్రాహ్మణి—మీకు ఆచారవ్యవహారాలూ, శుచీ, శుభ్రమూ వున్నాయిటే? యిది తేడా కాదూ?

మాలెత—మీరూ మానుకుంటున్నారుగా? కాదంటే మావాళ్లూ మిమ్మల్ని చూసి నేర్చుకుంటూనే వున్నారుగా? ఇంక తేడా యేదీ?

బ్రాహ్మణి—మీరు కల్లు తాగుతారు.

మాలెత—మీవాళ్లూ తాగుతున్నారు, గాపితి చేసుకో.

బ్రాహ్మణి—మీరు పందిని తింటారు.

మాలెత—మీరు మేకల్ని తిండం లేమూ యెగ్గెల్లోనూ?

బ్రాహ్మణి—మీరుగొడ్లు అమ్ముకు బతుకుతారు,

మాలెత—మీరు బిడ్డల్నమ్ముకు బతుకుతారు.

బ్రాహ్మణి—ఆఁ, ఆఁ, ఏం దుండగం? కళ్లూ కాళ్లూమన్నొద్దుకుంటేయింకాయింకా మీదికివస్తావూ?

మాలెత—అస్తమానం నీళ్లలో నానూ వుంటే నీ కళ్లూ కళ్లేమున్నకుండా పోతాయి.

బ్రాహ్మణి—ఎదిరిస్తావా? ఎదిరిస్తావుటే? నీకు తిండి దొరకొద్దూ? ఇంతటితోసరా?

మాలెత—నాకే మమ్మోయ్! నీకే తిండి దొరక్కుండా పోతుంది. పొలా లమ్ముకుంటావు. కూలికెళ్లలేవు. పనిచేతకాదు. కైత్తవులికి గాని వుద్దోగాలు లేవు. నువ్వే తిండి దొరక్క మాడి సత్తావు.

బ్రాహ్మణి—ఏమిటే?...ఏమిటే! నీ మొండితనం? సిగ్గూ బిడియమూ విడిచిపెట్టావా యేమిటే?

మాలెత—నీకా నాకా సిగ్గు లేకపోతా? మీవోళ్లంతా మా మంచాలమీద కూకుని, మావోళ్లతో సావాసం చేసి, ఇళ్లలోకీ, గుళ్లలోకీ, చబల్లోకీ, నూతులకాడికీ బతిమాలి మావోళ్లని తీసుగెల్తూ వుంటే, కల్చి బోనాలు సేత్తూ వుంటే, నువ్విప్పుడు "అచుగుంటా" "అచుగుంటా" అని మొరుగుతున్నావు. సిగ్గులేని వోళ్లెవరమ్మోయ్?

బ్రాహ్మణి—అయితే, అమ్మో! పెద్దా, పిన్నా కులమూ, మర్యాదా, అంటూ లేనుటే! మా పొలాలలో పని చేసుకు బతికేవాళ్లు గదా మీ కింత తుళ్లిపాటు తగునా?

మాలెత—డబ్బున్న వోళ్లే గొప్పోళ్లు. వాళ్లకే మరేద. అన్నికలాల వోళ్లని దేముడే పుట్టించాడు. ఎనకెప్పుడో మీకు మేము సాకిరీ సేస్తే యిప్పుడు మీకు మీయీదుల తుడత్తం లేదటమ్మా?

బ్రాహ్మణి—ఇంతేనా? దేశ మంతా యిల్లా మండిపోవలసిందే యింకా?

మాలెత—వొక దేశపోళ్లం. మీలాగే మేమూ సీమూ నెత్తురూ వున్న వోళ్లం. మనుసులం. మమ్మల్నిలా తరిమికొట్టినల్లాళ్లూ మండిపోకే మాద్దీ?